# ముకుందాము

మధురాంతకం రాజారాం

ప్రయాణమై బయటికి వచ్చేవరికి వీధిలో రాజశేఖరంగారు ఎదురయ్యారు. ఎక్కడికని అడిగే అలవాటు ఆయనకు లేకపోయినా, అడిగితే అపశకునమవుతుందని "నెల్లూరు వెళ్ళొస్తానండీ" అన్నాను.

"నెల్లూరా!" వీధిలో ఆగి నాకేసి చిత్రంగా చూస్తూ అడిగారు రాజశేఖరంగారు.

"అక్కడ ఎవరితోనైనా మాట్లాడి రమ్మంటారా?"

"ఊహూ వద్దు" అన్నారు రాజశేఖరంగారు.

ఆ వద్దన్న ధోరణిలో తనకు కావలసిన వాళ్ళెవరో నెల్లూరులో వున్నట్టు, ఉన్నా వాళ్ళతో నేను మాట్లాడ్డం రాజశేఖరంగారికి ఇష్టంలేనట్టు నాకు స్ఫురించింది

కొంపదీసి ఆ నెల్లూరులో వున్నవాళ్ళు రాజశేఖరంగారి కూతురూ, అల్లుడూ కారు గదా!

*   *   *

బస్సు పట్నం పొలిమేర సమీపించేవరికి సన్నసన్నగా వర్షం జారసాగింది. ప్రొద్దు పోయి నాలుగైదు గడియలై వుంటుంది నీల మేఘాచ్ఛన్నమైన ఆకాశంక్రింద, సాంద్ర తిమిరావృతమైన పట్టణంలో వీధుల తాలూకు విద్యుద్దీపాలు మాత్రం మినుకు మినుకుమంటున్నాయి బస్సు హెడ్‌లైట్లలో, పరుగెడుతోంది బస్సు పరుగుతో పందెం వేసుకున్నట్టు వర్షం క్రమక్రమంగా ఉద్ధృతమై పోతోంది. సమయానికి డ్రయివరుకో మంచి ఉపాయం తట్టింది. అతడొక హోటలు ముఖద్వారం ముందు బస్సు ఆపి "ఊఁ, త్వరగా దాటుకోండి. స్టాండులో దిగితే తలదాచా దొరకదు" అని హెచ్చరించాడు. అదృష్టవశాత్తు హోటలంతా ఖాళీగా వుంది. ప్రయాణికుల్లో చాలమందికి గమ్యస్థానాల పైనే కలవరం వుండటంచేత కాబోలు, వర్షం ఎప్పుడు వెలుస్తుందా అన్నట్టు ద్వారందగ్గర నిల్చుని వర్షధారల వైపు చూస్తున్నారు. ప్రొప్రయిటరు "ఉప్మా వేడిగా వుందండీ! లోపలికి వెళ్ళి కూచో గూడదూ" అంటూ విజ్ఞప్తి చేసుకుంటున్నాడు. అసలు సంగతేమిటంటే లోపల యింకా భోజనాలు తయారైనట్టు లేదు. లేకుంటే ప్రొప్రయిటరు అందరినీ కూచోబెట్టి వరుసగా ఆకులు వేయమని చెప్పి వుండేవాడు. కాసేపాగి, ఆ కాబోయే భోజనాన్నే వేడివేడిగా ఆరగించి వెళ్దామనుకుని కుర్చీలో కూచున్నాను అప్పుడో విచిత్రం జరిగింది. రెండు నిమిషాలపాటు ఎక్కడివారక్కడ స్థాణువులై నిలిచిపోయారు బ్రహ్మాండ భాండం ఒక్కసారిగా పెటిల్లని పగిలిపోయిందేమో ననిపించింది ఆ ఉరిమిన ఉరుము ఆకాశంలో ఎక్కడో గాక, క్రిందికి దిగివచ్చి ప్రాణుల కర్ణకుహరాల్లోకి చొచ్చుకపోయి అక్కడ ఉరిమినట్టు తోచింది. విద్యుద్దీపాలన్నీ కలసి మాట్లాడుకున్నట్టు హఠాత్తుగా ఆరిపోయాయి. ప్రొప్రయిటరు "లైట్, లైట్ 'అని కేక వేయసాగాడు. కానీ ఆ లైటు రంగం మీదికి రాక మునుపే వ్యక్తిగతంగా నేనొక యిక్కట్టుపాలై పోయాను.

ఎవడో యినప కడ్డీలాంటి మనిషి మరెక్కడా తావులేనట్టు ఆ చీకటిలో నా పైన కూలబడిపోయాడు చేసింది చాలక ప్రాధేయపూర్వకంగా "సారీ, సారీ! క్షమించండిసార్" అన్నాడు. ఆ గొంతు నాకు చిరపరిచితం "ఏమిటోయ్ నువ్వా! ఎక్కడున్నావ్, ఏంచేస్తున్నావ్" అంటూ పరామర్శించాను "ఇప్పుడంత తీరికెక్కడిదండీ. మాష్టారూ! అత్యవసర కార్యార్థం డాక్టరుగారికోసం పరుగెడుతున్నాను. ఈ ఉరుమొకటి వచ్చి లైట్లు పోయాయి త్రోవ తెలియక ఈ హోటల్లోకి వచ్చేను వర్షం వెలసినట్టుంది. వెళ్తున్నాను," అంటూ పారిపోబోయాడు. "అదేమిటోయ్! బోలెడు విషయాలు అడగాలనుకుంటె పరుగు తీస్తున్నావు" అంటూ అతడి చేయి పట్టుకున్నాను "మన్నించండి మాష్టారూ! తొందరపని రేపొకసారి యింటికి రండి జండామానువీధి నంబరు అరవైనాలుగు" అంటూ అతడు చేతిని విడిపించుకొని చరచరా చీకటిలో జారిపోయాడు.

అతడిపేరు రామరత్నం!

ఆశ్చర్యకరమైన విషయమేమిటంటె ఈనాడతడు నన్ను విడిపించుకొని చీకటిలోకి జారిపోయినట్టే, రెండేళ్ళనాడు కూడా తో కబురైనా చెప్పకుండా చీకటిలోకి కాకపోయినా అంతకంటే దిక్కులు తోచని భవిష్యత్తును చీల్చుకుంటూ ఎక్కడికో వెళ్ళిపోయాడు

అలా వెళ్ళిపోయినవాడు, ఈనాడు ఈ హోటల్లో తేలి మళ్ళీ యిట్టే మాయమైపోయాడు.

టికెట్టు తీయకుండా, గమ్యస్థానం యిది అని నిర్ణయించుకోకుండా జీవితపు రైలుబండిలో కూచున్న రామరత్నం నిజంగా చిత్రమైన మనిషి!

*   *   *

ఐదారేళ్ళ నాటిమాట! ఒక సుప్రభాతం. వరండాలో కూచుని పేపరు చూచుకుంటున్న వాణ్ణి, వీధిమెట్లపైన కాలిచప్పుడు విని తల పైకెత్తాను. "బాగున్నారా మేష్టారూ! చాలాకాలం తర్వాత చూస్తున్నాను." అంటూ వరసయ్య లోపలికి వచ్చాడు. మెడలో కండికంటె, చెవుల్లో అంటుజోళ్ళు, దట్టంగా మీసాలు, పెద్ద తలపాగా, వీటితో కల్నాటివీరుడిలా ద్యోతకమయ్యే వరసయ్యను ఛాయలా వెంబడిస్తూ ఒకకుర్రాడు లోపలికి వచ్చాడు.

"మీ అబ్బాయా వరసయ్యా! బాగా ఎదిగినట్టున్నాడే" అన్నాను. "ఏముందండీ! చూస్తుండగానే కాలం గడిచిపోతుంది. మీ పెళ్ళి నిన్ననో మొన్ననే జరిగినట్టుంది తలుచుకుంటే! కానీ అప్పుడే పదిహేనేళ్లు దొర్లిపోయినట్టున్నాయి. మీ పెళ్ళినాటికి వీడికి నాలుగేళ్ళు" అన్నాడు వరసయ్య.

ఆ మాటల్తో వరసయ్య హృదయంలోని మధురస్మృతుల్ని ఉసికొలిపి మేల్కొలిపినట్టయింది. రెండొడ్లబళ్ళల్లో మగపెళ్ళివాళ్ళం బయలేరడమూ, మార్గమధ్యంలో చల్దిభోజనాలు తినడమూ, ఆ ఊరేగింపూ, ఆచారాల్లో ఏ ఒక్కటీ బీడుపోకుండా జరిగిన ఆ అయిదురోజుల పెళ్ళి అవన్నీ మరపుకురాని మధురానుభవాలు! ఆ పెళ్ళిలోనే నేను వరసయ్యను తొలిసారిగా చూడ్డం తటస్థించింది. మామగారు పనులు పురమాయిస్తుంటే ఇంటా బయటా, పందిరిలో, వంటగదిలో అన్నిచోట్లా తానుగా విహరిస్తూ వివాహకార్యాలు నిర్వర్తించిన ఆ వడికారుమనిషి వరసయ్య ముఖంలో నేడు వృద్ధాప్యం తొంగిచూస్తున్నది.

# ముక్కుదాడు

"ఊహూ నరసయ్యా! అలా కొంచెపైన కూచో!" అంటూ ద్వారందగ్గరికి వెళ్ళి రుక్మిణిని పిలిచాను. "రాక రాక వచ్చావే నరసయ్యా! ఉండు, కాఫీ తెస్తాను" అంటూ ద్వారందాకా వచ్చిన రుక్మిణి మళ్ళీ లోపలికి పోయింది "నేనే కాదమ్మాయ్! నీ అల్లుణ్ణి కూడా తీసుకొచ్చాను. మాకు కాఫీలు త్రాగే అలవాటులేదు గానీ నువ్వొక అడుగు నిలబడు" అన్నాడు నరసయ్య. "అల్లుడివైతే తెచ్చావుగానీ మాకు అమ్మాయిలేదే" అంటూ నవ్వింది రుక్మిణి.

నరసయ్య వచ్చిన పనేమిటో సంగ్రహంగా చెప్పేశాడు. కుర్రాడి హైస్కూలు చదువు పోయిన మార్చితో పూర్తయింది. కాలేజికి అప్లికేషను వేశారు. సీటు దొరికింది. భోజనమైతే ఏ హోటల్లోనైనా పెడ్తారు. కానీ హోటల్లో అన్నం తినడం కన్నా, వాడు కాలేజికి వెళ్ళి శ్రద్ధగా చదువుకోడం ముఖ్యం! ఎవరో ఒకరు తనపైన నిశితంగా నిఘావేసి వుంచకపోతే యిరవైయేళ్ళ కుర్రాడు పట్నంలో చెడుతిరుగుళ్ళు పోవడానికి అవకాశం వుంది. "నాకీ మేలు చేసిపెట్టాలి మేష్టారుగారూ!...అమ్మాయ్! పిడికెడు నీబిడ్డే అనుకోవాలి! నాకేం తెలియదు. నెల నెలా పైకం పంపిస్తుంటానంతే! వాడి చదువుకూ, ప్రవర్తనకూ మీదే పూచీ!" అంటూ ముగించాడు నరసయ్య.

కుర్రాడికోసం వీధివైపు గది ఖాళీచేయించాము. ప్రక్కవీధిలోనే ఒక హోటలుంటే అక్కడ భోజనం ఏర్పాటుచేశాను. రామరత్నం కాలేజిలో చేరి చదువుకోసాగాడు.

'రామరత్నం నెమ్మదైనవాడు. శ్రద్ధగా చదువుకుంటాడు. క్లాసు తెచ్చుకుంటాడు. అతడికి మంచి ఉద్యోగం దొరుకుతుంది.' ఆదిలో నేనూ, రుక్మిణి రామరత్నాన్ని గురించి యిలాటి నిర్ణయానికే వచ్చాము. కానీ సూర్యాస్తమానం తర్వాత మెల్లమెల్లగా వచ్చి లోకాన్ని క్రమ్ముకునే చీకట్ల పోకలా రామరత్నం స్వభావంలో క్రమక్రమంగా మార్పు కనపడసాగింది. అసలే చురుకుపాలెక్కువైన కుర్రాడేమో, పట్టణ వాతావరణం పైపైని నివురుని ఊఫ్‌మని ఊదివేయగా రామరత్నం కేవలం నిప్పుగా మిగిలిపోయాడు!

రామరత్నంలో ఈడుకుమించిన తెలివితేటలు! ఏ సుముహూర్తాన అతడికి కాలేజి చదువులు నిస్సారంగా, నిరర్థకంగా గోచరించాయో నాకు తెలియదు. ఆ క్షణాన్నే అతడు పాఠ్యగ్రంథాలన్నిటినీ కట్టగట్టి ఓ మూల పారవేశాడు. ఆ తరువాత అతడి పుస్తకాల అల్మారాలోకి మరోరకం సాహిత్యం దిగుమతి కాసాగింది. ఆ మధ్య శృంగారాన్ని సరసమైన ధరకు ప్రచారంచేస్తూ కొన్ని పత్రికలు వచ్చాయి. తాళపత్రాల్ని శోధించి గొప్ప 'తీసిస్' వ్రాయదలచుకున్న యూనివర్సిటీ లెక్చరరు కుండవలసిన దీక్ష రామరత్నానికి ఆ పత్రికలు చదవడంలో పట్టుబడింది!

ఓ రోజు సాయంత్రం రుక్మిణిని వీధివైపు గదిలోకి తీసుకెళ్ళి "నేను చెప్పలేదమ్మోయ్ రుక్మిణీ! నీ అల్లుడు చెడిపోతున్నాడు" అన్నాను.

"మీది మరీ చాదస్తపువాలకమండీ! పుస్తకాలు చదివితేనే చెడిపోతారా ఎవరైనా!" అంటూ రుక్మిణి ఆశ్చర్యం వెలిబుచ్చింది.

"సరేలే! రామరత్నం లాంటివాళ్ళు యిలాటి పుస్తకాల్ని చదవకపోయినా చెడిపోగలరనా నీ వుద్దేశం?" అన్నాను. రుక్మిణి కర్థంకాలేదు. కానీ ఆమెకు నేను అర్థం విడమరచి చెప్పవలసిన అవసరం లేకపోయింది. పదిరోజుల తర్వాత, ఓరోజు సాయంత్రంపూట కాఫీ కలుపుతూవుండి, ఉన్నట్టుండి తలపైకెత్తి రుక్మిణి "ఏమండీ! ఆ అబ్బాయి వాటం నాకూ ఏమాత్రం నచ్చటంలేదు. మనకెందుకని చూసీ చూడనట్లు ఊరుకుంటున్నాను" అంది.

"ఊరుకోక మనమేంచేయాలో తెలియడంలేదు రుక్మిణీ!" అన్నాను. అతడేం చేస్తున్నాడో నాకూ చూచాయగా తెలుసు. కాలేజి ఎలక్షన్లలో పోటీచేసి రెండు నెలలపాటు పట్టణమంతా చెడతిరిగాడు. ఆ ఎన్నికల్లో కలిగిన ఓటమిని మరచిపోవడానికని పోయిననెల హంపీ శిథిలాలు చూచి వచ్చాడు. బాగా డ్రెస్ చేసుకుని, ఒక పుస్తకం చేతబట్టుకుని తొమ్మిది గంటలకల్లా వీధిలోకి వెళ్తాడు. మళ్లీ పదకొండుకే గదిలో వుంటాడు. దాదాపు వారానికి నాలుగైదుసార్లు సినిమా చూడకపోతే బ్రతకలేడు. కానీ రుక్మిణికి ఈ కుర్రాడి వాటం నచ్చకపోవడానికి యిదేగాక, మరొక ప్రత్యేక కారణం కూడా వుందని మాత్రం నా కప్పటికి తెలియదు!

"ఆ మాట నే నెందుకు చెప్పాలిగానీ మీరీరోజు షికారు వెళ్లకుండా యింటి దగ్గరే వుండండి. మీకే తెలుస్తుంది" అంది రుక్మిణి కాఫీగ్లాసు చేతి కందిస్తూ.

నిజమే! రామరత్నం అత్యద్భుతమైన వ్యవహారాన్ని ప్రారంభించి వున్నాడు. అతడు డాబాపైన వున్నాడన్న విషయం ఎదిరింటి రాజశేఖరంగారి అమ్మాయికెలా తెలుస్తుందోగానీ ఆమె అటువైపు డాబాపైకి వచ్చేస్తుంది. డాబాపైన ఆ కౌముదీ విహారాలకు అంతూ పొంతూ కనపడ్డంలేదు. ఆ రాత్రి పదిగంటలకుగానీ రామరత్నం క్రిందికి దిగి రాలేకపోయాడు. వచ్చినవాడు లోపల పడుకున్న మాకు వినిపించదన్న ధీమాతో కాబోలు దేవదాసులా, సలీములా, ఖయస్‌లా విరహగీతాలు పాడుకుంటున్నాడు.

"విరహం చాలా పాపిష్టిది! అది మనిషిని పిచ్చి పిచ్చిచేస్తుంది" అని రుక్మిణికి వివరించబోయాను! ఆవిడ మగతనిద్దురలో 'ఊఁ ఊఁహూ' అని, ఆ సంగతి తనకేం పట్టనట్టు నిద్దరపోసాగింది.

ఎదురింటి రాజశేఖరంగారి అమ్మాయి కింకా పదహారేళ్లు నిండలేదు. —




…మ్మాయి పేరు సంగ్రహంగా లత. …గాకలతో, స్వర్ణలతో, ప్రేమలతో రుక్మిణి …డిగితే తెలుస్తుంది. ఏ లతైనా, వనితా, …తా ఆశ్రయం లేకుండా శోభించవు గాబట్టి …ఆ అమ్మాయి ఎదురింటి అబ్బాయిచేత ఆక …ింపబడడంలో ఆశ్చర్యము లేదు. కానీ సర్వదా ప్రేమికుల ఆగ్రహానికిమాత్రమే …చుకున్న ఈ సంఘంమాటేమిటి? ఈ ప్రణయ వృత్తాంతం రాజశేఖరంగారి కెంత వరకూ రుచిస్తుంది? అప్పోసప్పో చేసి కుమారుణ్ని చదివిస్తున్న వరసయ్య మీద యీ ప్రణయగాథ యొక్క ప్రభావం ఎలా వుంటుంది?

రాజశేఖరంగారు ఖండితవాది. ఆయనలో తన సంతానంపట్ల మమకారం యెంత యెక్కువో, తనమాట నెగ్గాలన్న పంతమూ అంత ఎక్కువే! చేసింది గవర్నమెంటు నౌఖరీ కావడంవల్ల సూటిగా మాటాడ్డమూ, అభిప్రాయభేదం కలిగినప్పుడు యెదుటి వాణ్ని ఘాటుగా విమర్శించడమూ ఆయన రక్తంలో జీర్ణించిపోయిన గుణాలు. రాజశేఖరంగారి సంగతలా ఉండగా, ఆయనకు వస్తాదుల్లాటి కుమారులు నలుగురున్నారు. గోటితో పోయే వ్యవహారాన్నయినా, బాహుబలంతో పరిష్కరించుకోవడం వాళ్ళ పద్ధతి! కొంపదీసి వాళ్ళు నలుగురూ కలసి ఈ రామరత్నంపైన బడితే వీడి గతేంకావాలి?

కానీ ఆ చల్లటి రాత్రివేళ, అనాగత పరిణామాన్ని గురించి నా మనసులో లీలగా ఏర్పడిన ఈ అనుమానం, తరువాత కొద్ది రోజులకు వీధిలో నలుగురూ గుమిగూడి ఆనందించడానికి వీలుగా ఒక యదార్థదృశ్యముగా మారగలదని మాత్రం నేననుకోలేదు.

కానీ అది అలా జరిగింది!

సంధ్యాసమయం. నేను స్కూలునుంచి ఇంటికి వస్తున్నాను. రాజశేఖరంగారి కుమారులు నలుగురూ చొక్కా చేతులు పైకి తీసుకొని వీధిలో నిలబడి రామరత్నాన్ని పిలుస్తున్నారు.

"ఎందుకండీ! అతడితో మీ కేంపనితగిలింది?" అన్నాను.

"ఏంలేదు. ఒక చేయి చూడాలనివుంది" అన్నాడు కుమారచతుష్టయంలో ఒక్కడు.

వాళ్ళకు నచ్చచెప్పి, అక్కడినుంచీ పంపివేసేలోపల నాకూ, మరికొందరు పెద్దమనుషులకూ తలప్రాణం తోకకు వచ్చింది. అప్పటికీ ఒక షరతుపెట్టిగానీ వాళ్ళు వెళ్ళలేదు. మరునాటి వుదయంనుంచీ రామరత్నం వాళ్ళ కళ్ళకు కనిపించగూడదు! అలా కనిపిస్తే వాడి చేతులకూ, కాళ్ళకూ వాళ్ళు జవాబుదారీ కాదు!

భగవంతుడిచ్చిన కాళ్ళు చేతులు హూనం కావడం రామరత్నానికిష్టంలేదు. అతడు గదిలోనుంచీ ఎప్పుడు బయటికి వెళ్ళిపోయాడోగానీ, నాలుగైదు రోజులు గడిచినా యింటికి తిరిగిరాలేదు. పీడ విరగడయిందని రుక్మిణీ, నేనూ సంతోషించాము. కానీ అయిదోరోజు తెల్లవారేసరికి ఎదురింటి రాజశేఖరంగారి అమ్మాయి యింట్లో కనిపించడం లేదని తెలిసినప్పుడుమాత్రం రుక్మిణి ముక్కుమీద వ్రేలేసుకుని కాసేపు విచారించకుండా వుండలేకపోయింది.

నాకూ విచారం కలిగినమాట నిజమే! రామరత్నం తన జీవితంలో నేర్చుకున్న విద్య ఒక్కటే ఒక్కటి! అది నియమోల్లంఘనం. అతడేమూశాడు? తనకే నమ్ముకున్న అమ్మాయి నేంచేస్తాడు? ఇదంతా కడకు 'నాకౌ భంగం'గా పరిణమించదుగదా!

* * *

జండామాను వీధిలో అరవై నాలుగో నంబరు యిల్లు. అది చుట్టు భవంతిగా కట్టిన పెంకుటిల్లు. ఆ యింటి వాలకం చూస్తుంటే అది మనుష్యులకు గాకుండా బల్లులూ కల్లులూ, తేళ్ళూ, జెర్రులూ, దోమల్లాంటి ప్రాణిసముదాయానికి నివాసయోగ్యంగా ఏకరుణామయుడైన



# ★ ముక్కు దాడు ★

కౌశాలీయుడో కట్టించినట్టు తోస్తుంది. లోపల అడుగు పెడుతుండగానే "ఎవరూ? ఎవరికోసం" అంటూ నాలుగువైపులనుంచీ నలుగురు అరిచారు. రామరత్నంకోసమని చెప్పాను. "ఐతే యిటు, యిటు" అంటూ సంస్కృత నాటకాల్లోలా దారి చూపించారు. గదిలోపల ప్రవేశించాను. ఓమూలగా నులకమంచంమీద పడుకునివున్న రాజశేఖరంగారి అమ్మాయి "ఎన్నిరోజుల కెన్నిరోజులకు! అలా కుర్చీలో కూచోండి. ఆయన యింతవరకూ యిక్కడే వుండి, యిప్పుడే బయటికి వెళ్ళారు" అంది.

మరెప్పుడైనా అయితే లేచి మర్యాద చేయనందుకు ఆ అమ్మాయిపైన నాకు కోపం వచ్చివుండేదేమో! ఆమె తలకు వేసుకున్న ముసుగు, గదిలోపలి ఆవాతావరణం, ప్రక్కన పాతగుడ్డలమధ్య పడుకుని పైకప్పుకేసి చూస్తున్న వేలెడంత పసినిసుగు, విషయమేమిటో నాకు విశదీకరించి చెప్పేశాయి.

"ఏమిటమ్మాయ్, పుత్రోత్సాహమా" అన్నాను.

"అదిప్పుడే ఎలా కలుగుతుంది మీరంతా చిల్లిచూచి పొగడొద్దా?" అంటూ మెల్లగా నవ్వింది లత.

కాసేపు మౌనంగా వుండి, ఉత్కంఠను ఆపుకోలేక "తొందరపడి అడుగుతున్నందుకు మరేమీ అనుకోకమ్మాయ్! అబ్బాయి ఎలా వున్నాడు" అన్నాను.

"బాగానే వున్నారే ఆయనకేం!"

తెల్లబోయి, తెప్పరిల్లుకుని "కాదు. ఉద్యోగం, అదీ ఏమైనా చేస్తున్నాడా? లేదా అని" అంటూ సందేహం వెలిబుచ్చాను.

"ఉద్యోగం చేయకపోతే కాపురం ఎలా జరుగుతుందండీ?

అదేదో ఫ్యాక్టరీలో ఆయన లెక్కలు వ్రాస్తున్నారు. నేనూ ఈమధ్య కుట్టుపని నేర్చుకున్నాను. నాలుగైదు నెలలుగా ఓపిక లేక నేను మిషనుపైన కూచోవడంలేదు. ఆయనే ఎలాగో కాపురం నెట్టుకొస్తున్నారు."

"నిజంగానా అమ్మాయ్! రామరత్నంలో యిలాటిమార్పు వచ్చిందంటే నమ్మశక్యంగా లేదు."

"ఎల్లకాలమూ ఒకేరీతిగా జరుగుతుందండీ?" అంది లత.

"బాగానేవుంది. మీ కాపురాన్ని చూస్తుంటే నాకెంతో ఆనందం కలుగుతోంది. కానీ ఒకటే లత..." అర్ధోక్తిలో ఆగిపోయాను.

"నిజమే! నేను మావాళ్ళకీ, ఆయన తనవాళ్ళకీ దూరంగా బ్రతుకుతున్నాము. ఈ వేరుబందరాల్ని ఎవరు సర్దుతారు మాష్టరుగారూ!

"అన్నీ మీరే సర్దుకోవాలమ్మాయ్! అబ్బాయిని ఒకదోవలోకి తెచ్చిందెవరు? తల్లి, తండ్రి, గురువు చేయలేనిపని నువ్వు చేశావు. ఒకవేళ మీనాన్నగారికి నీమీద కోపంవున్నప్పటికీ నరసయ్యకుండటంలో న్యాయంలేదంటాను... ఇంతకూ అబ్బాయి ఎవరిపోలిక" అంటూ పైకిలేచాను.

లత ఉన్నట్టుండి లేచి కూచుంటూ "మాష్టరుగారూ! మీకు పుణ్యముంటుంది. ఆయన నామాటవింటారో, వినరో సందేహంగావుంది. మీరు నాకోసం ఒకపనిచేసి పెట్టాలి" అంది.

"ఏమిటో చెప్పు" అన్నాను.

"సరాసరి యిక్కడనుంచీ ఫోటోషాపుకు వెళ్ళండి."

"వెళ్తాను"

"రెండు కార్డులు కొనండి"

"కొంటాను"

"రెండు ముక్కలు వ్రాయండి. ఎక్కువ అవసరం లేదు"

"సరే సరే! అర్థమైందమ్మాయ్" అన్నాను నవ్వుతూ!

* * *

రెండు ఉత్తరాల్లో ఒకటి రాజశేఖరంగారికీ, మరొకటి నరసయ్యకు పోస్టుచేశానని ప్రత్యేకించి చెప్పవలసిన అవసరంలేదనుకుంటాను. ఐతే నేను వాటిల్లో ఏదో గొప్ప చిదంబర రహస్యం వ్రాసివుంటానని మాత్రం ఎవ్వరూ అనుకోగూడదు!

ఎందుకైనా మంచిది. ముచ్చటైన ఆ మూడు వాక్యాల్నీ క్రింద ఉదహరించేస్తున్నాను.

"మీకు మనవడు పుట్టాడు. ఏం వారాలేదు. ముక్కూ, మొగమూ అంతా మీ పోలికే! ★




ఎక్కౌంటు పుస్తకాలు
తయారుచేయువారికి
బుక్ బైండర్సుకు-ప్రింటర్సుకు.

ది స్టాండర్డ్ మిల్స్ కో. లిమిటెడ్. న్యూ ప్రభాదేవి రోడ్, బొంబాయి 28.

3/1-5-3-78L




సావరిన్
మిఠాయిలు, టాఫీలు
దేశమంతటా ఆదరించబడినవి